# ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ వేగవంతం

**పాకిస్థాన్‌పై** 'సర్జికల్ దాడులు' సాగించి ఉగ్రవాదంపై పోరాడుతున్నామంటూ బిజెపి ప్రభుత్వం జాతీయ దురభిమానాన్ని ఓవైపున ప్రేరేపిస్తూనే, ప్రజల దృష్టిని పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా మళ్ళించే జాతీయోన్మాదపు ఈ రొద నడుమే – ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ కార్యక్రమాన్ని వేగవంతం చేసింది.

మనదేశ ఆర్థికవ్యవస్థలో పరివర్తన తెచ్చేందుకు తాను పూనుకున్నట్లుగా మోదీ పదేపదే నొక్కి చెపుతున్నాడు. దీని అర్థమేమంటే – ఆర్థికవ్యవస్థలో ప్రభుత్వం తన పాత్రను పరివర్తన చెందించుకొంటుందన్నమాట! అంటే, ఆర్థికవ్యవస్థను క్రమబద్ధీకరించే తన పాత్ర నుండి ప్రభుత్వం వైదొలగి ప్రైవేటు రంగానికి పూర్తిగా పగ్గాలు అప్పగించటమే.

సెప్టెంబర్ చివరివారంలో, ఆర్థికవ్యవహారాల క్యాబినెట్ సబ్‌కమిటి ప్రభుత్వ అదుపులోని సంస్థలను ప్రైవేటీకరించాలని నిర్ణయించింది. "వ్యూహాత్మక అమ్మకాల" ద్వారా అంటే వాణిజ్యసంస్థలలోని ప్రభుత్వ వాటాలను అమ్మటం దగ్గర నుండి ప్రైవేటు రంగానికి ఆదేశ పత్రాల అదుపు వరకు 20,500 కోట్ల రూ॥లను ఈ సంవత్సరం ఆర్జించదలచుకుంది.

ప్రాథమికంగా, హిందూస్థాన్ కేబుల్స్ మరియు భారత్ పంప్స్ అండ్ కంప్రెసర్స్ ఖాయిలాపడిన కారణంగా వాటిని పూర్తిగా మూతవేయాలని క్యాబినెట్ కమిటి నిర్ణయించింది. ప్రధాని మోదీ అధ్యక్షులుగానున్న ఆ క్యాబినెట్ కమిటి మరో 24 ప్రభుత్వ రంగ సంస్థలను మూసివేసేందుకు ఓ పథకాన్ని సిద్ధంచేసింది.

'నీతి ఆయోగ్' నియమించిన ఓ కమిటి చేసిన సిఫార్సులే క్యాబినెట్ కమిటి చేసిన ఈ నిర్ణయాలకు పునాదిగా వున్నాయి.

ప్రభుత్వరంగ సంస్థలను మూతవేసి, అవి చెల్లించాల్సిన అప్పులను చెల్లించిన తర్వాత ఆ ఆస్తిని అమ్మి, డబ్బురూపంలో మార్చుకోనున్నారు. అనగా మూతవేసిన ఆయా ప్రభుత్వరంగ సంస్థలకు చెందిన భూమి తదితరాలతో సహా ఆస్తి అంతటినీ అమ్మి వేస్తారు. ఎక్కువభాగం ఇలాంటి సంస్థల భూములను వేలం వేస్తారు. ప్రైవేటురంగ కొనుగోలుదారులే ఓ 'సిండికేట్'గా ఏర్పడి తక్కువ రేటుకు వేలంపాటద్వారా ఈ ఆస్థులను కైవసం చేసుకుంటారు.

ఈ రకమైన భూములను, ఆస్తులను ప్రైవేటురంగానికి అమ్మివేయటం, ఆశ్రిత విధానాన్ని ప్రోత్సహిస్తుంది. దేశీయ ప్రైవేటు యాజమాన్యాలకుగానీ లేదా విదేశీ కార్పొరేట్లకుగానీ ఈ ఆస్తులను అమ్మివేయటం – ఆశ్రిత పెట్టుబడిదారీ విధానానికి (క్రోని క్యాపిటలిజమ్) దోవతీస్తుంది. భూసేకరణలో ఏవిధమైన చట్టబద్ధ చీకాకులూ లేకుండా అత్యంత చౌకధరలకు బడా పెట్టుబడిదారులకు, పారిశ్రామిక కార్పొరేట్లకు భూములను కట్టబెట్టటమనే ప్రభుత్వ ఉద్దేశ్యం మేరకే, ఈ విధంగా ప్రభుత్వరంగసంస్థల భూములను అమ్మివేస్తుందనేది స్పష్టం.

15వేల హెక్టార్ల భూములను కలిగివున్న హెచ్‌పిసిఎల్‌కు చెందిన ఇండియన్ ఆయిల్ బయోఫ్యూయెల్ లిమిటెడ్ అనే ఓ కంపెనీని మూసివేయ సంకల్పించారు. ఈ తరహాలో మొత్తం ప్రభుత్వరంగ సంస్థలను తుడిచిపెట్టే ప్రక్రియ అమలుతో ఏ మోతాదులో అమ్మకాల రూపంలో ప్రభుత్వ భూమిని ప్రైవేటు రంగానికి కట్టబెట్టనున్నారో మనం చాలా తేలిగ్గా అర్థంచేసుకోవచ్చు.

అదే, భూమిలేని నిరుపేదలకు భూమిపంపిణీ చేయవలసివస్తే, నిరుపేద దళితులకు, ఆదివాసులకు, నిరుపేద శ్రామికులకు లేదా పారిశ్రామిక కార్మికులకు తలదాచుకోను గూడుకోసం ఇళ్ళస్థలాలు కేటాయించ వలసివస్తే మాత్రం ప్రభుత్వాలకు, పాలకులకు భూమి ఎక్కడా కనబడదు. కానీ బడాపెట్టుబడిదారులకు ప్రభుత్వరంగ సంస్థలకు చెందిన, భారత ప్రజలందరి ఉమ్మడి, సంయుక్త ఆస్థి అయిన విశాల భూఖండాలను అప్పగించే విషయంలో ముందువెనక ఆలోచించేదేమీ లేకుండా, చట్టపరమైన ఆటంకాలేమీ లేకుండా కట్టబెడ్తున్నారు.

భూమి సమస్య విషయంలో ప్రభుత్వాల వర్గ దృక్పథం ఇంతే వుంటుంది. భూమిలేని నిరుపేద శ్రామికులకంటే ప్రైవేటు రియల్‌ఎస్టేట్ వ్యాపార వర్గానికి పెద్దపీటవేసి, ప్రాముఖ్యతనీయటమే జరుగుతుంది.

వాస్తవానికి నిజమైన అర్థంలో ప్రభుత్వరంగ సంస్థలేవీ నష్టాలలో నడవటంలేదు. ప్రభుత్వరంగ సంస్థలకు ఆపాదిస్తున్న నష్టాలేవైతేవున్నాయో, ఆ నష్టాలన్నీ నిజానికి సంబంధిత ప్రభుత్వాల విధానాల ఫలితంగా సంభవించినవేననేది స్పష్టం.

2013–14 ఆర్థిక సంవత్సర కాలంలో పన్నులు, సుంకాలు, డివిడెండ్ల రూపంలో ప్రభుత్వరంగ సంస్థలు ప్రభుత్వ ఖనాజాకు 2,20,166 కోట్ల రూ॥ల ఆదాయాన్ని జమచేశాయి. 2012–13 ఆర్థిక సంవత్సరంలో 1,63,212 కోట్ల రూ॥ ప్రభుత్వానికి చెల్లించాయి. ఈ విధంగా ఈ స్థాయి పెద్దమొత్తాలను ఆదాయంగా దిగమింగుతున్న ప్రభుత్వాలు వాటిని నష్టాలను సమకూర్చే ప్రభుత్వరంగ సంస్థలుగా మిగుల్చుతున్నాయి.

గత ఎనిమిది సంవత్సరాల కాలంలో ప్రభుత్వాలు భారత మరియు విదేశీ కార్పొరేటు రంగానికి 6.5 లక్షల కోట్ల రూ॥విలువైన రాయితీలను కల్పించాయి. దీనికి తోడుగా, ఈ కార్పొరేట్లనుండి వసూలు చేయబడని పన్నులు దాదాపు నాల్గునుండి ఆరు లక్షలకోట్ల రూ॥ వరకు వుంటాయి. ఈ రాయితీలకు తోడుగా, పది బడాకార్పొరేటు సంస్థలు జాతీయ బ్యాంకులనుండి అప్పులు తీసుకొని ఎగ్గొట్టిన వాని విలువ 8 లక్షల కోట్ల రూపాయలుగా వుంది. వీటిని పారుబాకీల క్రింద జమకట్టి రద్దుచేయటం జరుగుతోంది. బడాపెట్టుబడిదారీ కార్పొరేట్లకు పెద్దపళ్ళెంలో వడ్డించి కట్టబెడ్తున్న ఈ పెద్ద మొత్తాలతో పోల్చినపుడు, ప్రభుత్వరంగ పరిశ్రమల ఆస్తులను, భూములను, వాటాలను అమ్మటంద్వారా రాబట్టదలచుకున్న మొత్తం అతి స్వల్పమైనది. బడా పెట్టుబడిదారులకు ఇవన్నీ సమర్పించటంతో ప్రభుత్వం సంతృప్తి చెందకుండా, ప్రభుత్వరంగ సంస్థల అత్యంత విలువైన భూములను 'పరివర్తన దశ' పేరున ప్రైవేటు రంగానికి కట్టబెట్టేందుకు పూనుకుంది.

ఇటీవల తాజాగా ప్రభుత్వరంగ సంస్థ అయిన బిహెచ్ఇఎల్ 40శాతం డివిడెండ్లను ప్రకటించటమే, ప్రభుత్వరంగ సంస్థలు నష్టాలతో నడుస్తాయనే వాదనలన్నీ, కాకమ్మ కథలని, అవాస్తవికమైనవని రుజువు చేస్తున్నది. ప్రభుత్వాల, పాలకుల ప్రజావ్యతిరేక విధానాలను, ప్రైవేటీకరణ పథకాలను అమలుచేసే ఉద్దేశాన్ని మరుగుపరిచేందుకు ప్రభుత్వరంగ సంస్థలు నష్టాల్లో నడుస్తున్నాయని ప్రభుత్వాలు చెప్పేది ఓ సాకు మాత్రమే!

ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఈ ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా ప్రజానీకం మద్దతుతో ఈ దేశ కార్మికులు, కార్మికవర్గం ఐక్యంగా పోరాడటం ద్వారానే ప్రజల ఆస్థులయిన ప్రభుత్వరంగ సంస్థలు ప్రైవేటు కార్పొరేట్ల హస్తగతం కాకుండా కాపాడుకోవటం సాధ్యమౌతుంది.

oooo